క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న నాయకులు

నదుం: మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు బుధవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి స్థల పరిశీలన చేశారు. కొన్ని రోజుల క్రితం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి మండల పర్యటనలో విగ్రహం ఏర్పాటుకు దళిత నాయకులు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారు. తన వంతు సహకారం ఇస్తానన్నారు. ఎంపీ ఆదేశించడంతో బస్టాండు ప్రాంతంలో వారు స్థల పరిశీలన చేశారు. అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ అధక్షుడు గిరిబాబు, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, కో–ఆప్షన్ మెంబర్ ఇమ్రాన్, లోకనాథం, శ్రీరాములు, రామాంజులు, శరత్, మునిరామయ్య పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్‌పై వర్క్‌షాపు


ప్లేస్‌మెంట్స్‌పై మాట్లాడుతున్న రమ్య

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కుప్పం గ్రీన్ స్కిల్స్ సెంటర్ ప్లేస్‌మెంట్స్‌పై బుధవారం వర్కుషాపు నిర్వహించింది. డిగ్రీతోపాటు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే ప్రైవేటు కంపెనీలు నిర్వహించే జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని రిసోర్స్‌పర్సన్ రమ్య వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


ఉపాధ్యాయ దంపతులను సన్మానిస్తున్న టీచర్ల బృందం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో బాటనీ అధ్యాపకుడు ఆంజనేయులు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. సహచర ఉపాధ్యాయులు ఆంజయనేయులు దంపతులను ఘనంగా సన్మానించారు. 28 ఏళ్ల సర్వీసులో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సిద్దరామయ్య, తాతయ్య, హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు

- ఆర్డీఓ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏల ఆందోళన


ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న చేస్తున్న వీఆర్‌ఏలు

పలమనేరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణ నియోజకవర్గంలోని వీఆర్‌ఏలు బుధవారం పట్టణ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగక కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధికారులు నైట్ డ్యూటీలు, ఇసుక ర్యాంపుల వద్ద పహారా తదితర విధులను కేటాయిస్తూ ఇబ్బందుల్లోకి నెట్టి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్డీఓ భవానికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ అసోసియేషన్ నేతలతోపాటు సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- విస్మరిస్తే ఇబ్బందులు తప్పవు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

పలమనేరు: ప్రజా సమస్యలపై నాయకులుగానీ, అధికారులుగానీ నిర్లక్ష్యం వహించరాదని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నాయకులు ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. అధికారం మనదేనని ఉద్దేశంతో ప్రజా సమస్యలను పట్టించుకోకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన రైతన్నలు

- తొలకరి వర్షాలతో వేసవి దుక్కులు
- వేరుశనగ విత్తనాల పంపిణీకి అధికారులు సిద్ధం
- వర్షంతో పశువులకు తప్పిన మేత కష్టం


వాలుకు అడ్డంగా నాగలితో దుక్కి దున్నుతున్న రైతు


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా ఈ ప్రాంత రైతన్నలు ఎన్నో ఆశలతో కాడిపనులకు సన్నద్ధమవుతున్నారు. వర్షాధారిత పంటగా ఖరీఫ్‌లో వేరుశనగ సాగుకు రైతులు సమయాత్తమవుతున్నారు. ఈ నెలాఖరులో వ్యవసాయశాఖ నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనాలు రానున్నాయి. వచ్చే నెల తొలివారంలో వీటి పంపిణీ చేసే అవకాశం ఉంది. వ్యవసాయ పనుల సీజన్ మొదలు కావడంతో కూలీలకు ఇకపై చేతినిండా పని దొరికినట్టే!

ఈసారి ఖరీఫ్‌లో వేరుశనగ సాగు పెరిగేనా..?

పలమనేరు వ్యవసాయ డివిజన్‌కు సంబంధించి ఏటా సరాసరి వేరుశనగ సాగు 14 వేల హెక్టార్లు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల మూలాన ముందుగానే దుక్కులు సిద్ధం చేసుకోవచ్చు. దీంతో అదునులో విత్తనాలేసేందుకు సమయం ఉంటుంది. ఫలితంగా ఈ ఖరీఫ్‌లో వేరుశనగను సాగు మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇళ్లలో వేరుశనగ విత్తనకాయలున్న రైతులు వాటిని ఒలిచి సిద్ధం చేసుకుంటున్నారు.

వాలుకు అడ్డంగానే దుక్కులు దున్నాలి

దుక్కులు వాలుకు అడ్డంగా దున్నుకున్నట్లయితే చేలల్లోని భూసారం వర్షానికి కొట్టుకుపోదు. భూమిని లోతుగా దున్నుకున్నట్లయితే భూమి లోపలి క్రిమికీటకాలు, వైరస్‌లు చనిపోతాయి. ఈ నెలాఖరు లోపు వేసవి దుక్కులు సిద్ధం చేసుకుంటే అదునులో విత్తనాలను వేసుకోవచ్చు. భూసార పరీక్షల ఆధారంగానే రైతులు సిఫారసు మేరకు ఎరువులను వాడితే మంచిది. భూమిలో సమపాల్లో నత్రజని, భాస్వరం, పొటాష్ ఉండేలా చూడాలి.

–సంధ్యారాణి, ఏఓ, పలమనేరు

దుక్కులు బాగా చేసుకోవాలి

వేసవిలో అకాల వర్షాలు పడుతున్నాయి. ఇలాంటప్పుడు భూమిని ఎన్నిసార్లు దున్నితే పంట అంత బాగా పండుతుందని మా పెద్దలు చెప్పేవారు.. ఏదో వాన పడిందని ట్రాక్టర్‌తో రెండు దఫాలు దున్ని వేరుశనగ విత్తనాలేస్తే పంట సరిగా రాదు. అందుకే నాలుగైదుసార్లు బాగా దుక్కిచేస్తే వేర్లు కిందకి వెళ్లి మంచి దిగుబడులు పొందవచ్చు.

–సుబ్బన్న, రైతు,కల్లాడు

ఇకపై పొలం పనుల్లో బిజీబిజీ...

వేరుశనగ కోసం దుక్కులకు వాన పడింది. ఈ రెండు నెలలు రైతులకు పనులుంటాయి. మామిడి తోటలున్నరైతులకు కాయలు దించే సీజన్ మొదలవుతుంది.

వెంకటరెడ్డి, కల్లాడు,
పలమనేరు మండలం

కందుకూరికి ఘన నివాళి

పలమనేరు: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కందుకూరి సేవలను సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు వివరించారు. పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి


పాఠశాల వార్షికోత్సవంలో ఎంఈఓలు

పలమనేరు: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరిపించాలని ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రభుత్వ బడులు ముగింపు దశకు చేరుకున్న తరుణంలో అన్ని పాఠశాలల్లోనూ బుధవారం వార్షికోత్సవాలను నిర్వహించారు. పట్టణంలోని గుండుబావి పాఠశాల వార్షికోత్సవంలో వీరు మాట్లాడారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, ఆహ్లాదకరమైన సౌకర్యాలున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధింది అడ్మిషన్ల ప్రక్రియ మొదలైందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పుష్పపల్లకిలో కోదండరాముని విహారం


పుష్పపల్లకిలో ఊరేగుతున్న సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి


ఉట్లోత్సవంలో పోటీ పడుతున్న యువకులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా మగళవారం రాత్రి పుష్పపల్లకి సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో వేదపండితులు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. రాత్రి పలురకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పుష్పపల్లకిలో ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు కర్పూర హారతులిచ్చి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దపంజాణి పోలీసులు పర్యవేక్షించారు.

కిటకిటలాడిన బజారు వీధి

పుష్పపల్లకి సేవను తిలకించడం కోసం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో బజారు వీధి జనసంద్రమైంది. వివిధ దుకాణాల్లో వ్యాపారం కూడా జోరుగా సాగింది.

ఉట్లోత్సవం..కోలాహలం

పుష్పపల్లకిలో భాగంగా బాలేపల్లె గ్రామస్తులు ఉట్లోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యువకులు నువ్వా, నేనా? అని ఉత్సాహంగా పోటీపడ్డారు. గెలుపొందిన వ్యక్తిని కార్యనిర్వాహకులు నగదు బహుమతి సత్కరించారు.

వేడుకగా పవళింపు సేవ

పది రోజుల పాటు పలు వాహనాల్లో విహరించిన స్వామి వారికి చివరి రోజైన బుధవారం రాత్రి బుధవారం అర్చకులు పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు జానకిరాం, పట్టాభిరాం ఉత్సవాలను పర్యవేక్షించారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

కుప్పం: కుప్పం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం పట్టణంలోని బెగ్గిలిపల్లి పంచాయితీ ఎన్‌టీఆర్ కాలనీ వాసులకు గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్‌కు సంబంధించి అగ్ని ప్రమాదం జరిగితే ఆ ప్రమాదాన్ని ఎలా నివారించాలో నివారణ పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో కుప్పం అగ్ని ప్రమాద కేంద్రం అధికారి ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


పట్టణ వాసులకు గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పలమనేరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం అగ్ని ప్రమాదాలపై పట్టణంలోని ప్రకృతి అపార్ట్‌మెంట్‌లో స్థానిక ఫైర్‌శాఖ అవగాహన కల్పించింది. అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, జరిగితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. స్థానిక ఫైర్ ఆఫీసర్ మనోగరన్, సిబ్బంది పాల్గొన్నారు.

దానాల్లో విద్యాదానమే గొప్ప


శాంతకుమారి దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: అన్ని దానాలలో విద్యాదానం ఎంతో గొప్పదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక బాలిక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు కొఠారి శాంతకుమారి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని బుధవారం ఉపాధ్యాయుల బృందం సన్మానించింది. ముఖ్యఅతిథి జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతకుమారి 34 ఏళ్ల సర్వీసులో ఆదర్శ ఉపాధ్యాయురాలిగా సేవలందించడంతో పాటూ కవిగా సమాజానికి చైతన్యవంతం చేస్తూ రచనలు చేశారని, అలాగే జిల్లా, రాష్ట్ర, జాతీయ అవార్డులను కైవసం చేసుకున్నారని ఆమె సేవలను ప్రస్తుతించారు. అలాగే ఆమె భర్త కొఠారి వెంకటరత్నం సైతం ఉపాధ్యాయుడిగా, కవిగా సేవలు అందించి ఆదర్శ దంపతులుగా పేరు తెచ్చుకున్నారన్నారు. వారి సేవలను కొనియాడుతూ పద్యాల రూపంలో ఉపాధ్యాయులు హృద్యంగా వినిపించి, వారి విద్యాబోధనకు అభినందన మాలికలు అల్లారు. కార్యక్రమంలో వివిధ స్కూళ్ల టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పాళెంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాలు

పులిచెర్ల(కల్లూరు): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కల్లూరు పీహెచ్‌సీ మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పాళెం పంచాయతీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. 12 కేజీల పోషణ కిట్లను పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. కిట్లలో 3 కేజీల బియ్యం,1 కేజీ పప్పు, 500మిల్లీలనూనె, 25గుడ్లు, 500మిల్లీల పాలు, బాలామృతం 5 కేజీల చొప్పున ఉన్నట్టు చెప్పారు. వీటిని గర్భిణులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీడీపీఓ మల్లీశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మా.. చల్లంగ దీవించమ్మా..!

- నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు
- నిమజ్జనంతో జాతర పరిసమాప్తం


ప్రత్యేక పూజలందుకున్న నడివీధి గంగమ్మ


నడివీధి గంగమ్మ శిల వద్ద పూజలు చేసి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

చౌడేపల్లె: స్థానిక నడివీధి గంగమ్మ జాతర బుధవారం వైభవంగా ముగిసింది. మండలంలో వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు బాగా పండి ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరుతూ ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం రాత్రి కనుల పండువగా అమ్మవారికి మడివిలిరాజుతో కల్యాణోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు హాజకయ్యారు. బుధవారం తెల్లవారు జామున వరకు పురవీధులలో మేళతాళాల నడుమ ఊరేగించారు. నడివీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు పిండి దీవెలు, స్త్రీల వేషాలు ధరించి మొక్కులు చెల్లించారు. బుధవారం రాత్రి అమ్మవారికి కథను గానం చేసిన అనంతరం నిమజ్జనం చేశారు. మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

• రథోత్సవం


పాలేరులో విశేషాలంకారంలో సీతారాముల ఉత్సవ మూర్తులు

బంగారుపాళెం: మండలంలోని పాలేరులో మంగళవారం రాత్రి సీతారాముల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు హరికథా కాలక్షేపాన్ని నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజు మంగళవారం సాయంత్రం సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి మూలవర్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, చిన్నారుల కోలాట ప్రదర్శనల నడుమ రథోత్సవం కనువిందుగా సాగింది. యువకులు జైశ్రీరామ్ అంటూ రథం ముందు నినాదాలు చేశారు. రథంపై స్వామి అమ్మవారు భక్తులకు కటాక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు సీతమ్మ, రామయ్యలకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. రథాన్ని లాగేందుకు మహిళలు, గ్రామస్తులు పోటీపడ్డారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

• విమానోత్సవం


అరగొండలో నిర్వహిస్తున్న విమానోత్సవం

తవణంపల్లె: మండలంలో అరగొండలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి విమానోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం అర్చకులు ఆలయంలో మూలవిరాట్ సీతారామలక్ష్మణులకు అభిషేకం చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించి భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.